
బెయిలు వచ్చిన మరునాడే
మంత్రి పదవా...?

● సెంథిల్ బాలాజీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగదు మోసం కేసులో బెయిలుపై విడుదలైన మరునాడే మంత్రిగా బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీని సుప్రీంకోర్టు నిలదీసింది. అసలు తమిళనాడులో ఏం జరుగుతోందని అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సెంథిల్ బాలాజీకి బెయిలు మంజూరు మంజూరు చేస్తూ ఇచ్చిన తీర్పును రీకాల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సోమవారం న్యాయస్థానం ఈ విధంగా వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలో ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురి వద్ద నగదు వసూలుచేసి మోసానికి పాల్పడ్డారని అప్పటి రవాణా శాఖ మంత్రి సెంథిల్ బాలాజీపై అవినీతి కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుల ఆధారంగా చట్టవిరుద్ధంగా నగదు బదిలీకి పాల్పడ్డారని సెంథిల్ బాలాజీని ఈడీ అధికారులు గత ఏడాది జూన్ 14న అరెస్ట్‌చేశారు. ఈ కేసులో 471 రోజులు జైలుశిక్ష అనుభవించిన సెంథిల్ బాలాజీకి సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. దీంతో ఆయన బెయిలుపై విడుదలైన మరుసటిరోజు క్యాబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ నిర్ణయం వల్ల సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశముందంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆయనకు బెయిలు మంజూరు చేస్తూ ఇచ్చిన తీర్పు రీకాల్ చేయాలంటూ ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభయ్ ఎస్.ఓగా, అగస్టిన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. బెయిలు మంజూరైన కొన్ని గంటల్లోనే మంత్రిగా ప్రమాణం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. అంతేకాకుండా ఆయన మంత్రి హోదాలో సాక్షులను ప్రభావితం చేయరా అని నిగ్గదీసింది. ఈ మొత్తం వ్యవహారంపై వివరణ ఇవ్వాలని సెంథిల్ బాలాజీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదావేసింది.

మూడు జిల్లాలను ముంచెత్తిన ఫెంగల్

● విల్లుపురం, కడలూరు కృష్ణగిరి జిల్లాల్లో వరద బీభత్సం



జలదిగ్బంధంలో విల్లుపురం కొత్త బస్టాండు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు మూడు జిల్లాలను ముంచెత్తాయి. విల్లుపురం, కృష్ణగిరి, కడలూరు జిల్లాల్లో 40 నుంచి 50 సెం.మీ.లకు పైగా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ఆ జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. కడలూరు, విలుపురం జిల్లాలో శనివారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు చెరువులు, వాగులు, వంకలు నిండి కట్టలు తెగి జనావాసాలపై పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణగిరి జిల్లాల్లో రెండు రోజులపాటు కుండపోతగా కురిసిన వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో శనివారం ప్రారంభమైన వర్షాలు ఆదివారం ఉదయం వరకూ కొనసాగాయి. జిల్లాలోని ఊత్తాంగరైలో ఆదివారం 50 సెం.మీ. మేర వర్షం కురిసింది. ఊత్తాంగరై సమీపంలోని ఎక్కూరు అమ్మన్ చెరువు గండ్లు తెగి నీరు రహదారులను ముంచెత్తింది. వరద తాకిడికి రహదారి పక్కన ఉన్న వ్యాన్లు, కార్లు కొట్టుకుపోయాయి. వేల ఎకరాల్లో వరి నీట మునిగింది. పాంబారు డ్యామ్‌కు వస్తున్న నీటిని అలాగే దిగువకు వదిలేయడంతో డ్యాం పరీవాహక ప్రాంతాలైన మూండ్రాంపట్టి, పావక్కల్, అత్తిపాడి పంచాయతీల పరిధిలోని గ్రామాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. పోచ్చంపల్లి పోలీసుస్టేషన్‌లో వరదనీరు ప్రవేశించింది. ఇదే విధంగా ధర్మపురం, సేలం, నామక్కల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్కాడులో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు 40 అడుగుల వంతెన వద్ద మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. దీనితో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.

నీట మునిగిన పంటలు..

విల్లుపురం జిల్లా సెంజిలో అప్పంబట్టు చెరువు, సాలైపుదూరు చెరువు, పోత్తువాయ్‌మలయరసన్ కుప్పం తదితర చెరువులకు గండ్లు పడటంతో సుమారు 50 వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. సెంజి ప్రధాన చెరువు కూడా పూర్తి స్థాయిలో నిండింది. ఆ చెరువుకు గండ్లు పడే అవకాశం ఉండటంతో సెంజి ఎమ్మెల్యే మస్తాన్ అధికారులతో కలిసి ఆ చెరువు కరకట్టలను పటిష్ఠం చేయాలని ఆదేశించారు.

కోలుకుంటున్న పుదుచ్చేరి...

ఫెంగల్ తుఫాన్ తాకిడికి గురైన కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి వరద నుండి తేరుకుంటోంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కుండపోతగా కురిసిన వర్షాలకు పుదుచ్చేరి, సమీప గ్రామాలు నీటమునిగాయి. సోమవారం మధ్యాహ్నానికి వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. సోమవారం ఎండకు వరద నీరు కాస్త తగ్గుతూ వచ్చింది. సోమవారం వర్షం ఆగిపోవటంతో రవాణా సదుపాయాలు మెరుగయ్యాయి.

బాధితులకు రూ.5వేల సాయం..

పుదుచ్చేరి ఫెంగల్ తుఫాను బాధితులైన రేషన్ కార్డుదారులకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగసామి ప్రకటించారు. తుఫాను కారనంగా ఇళ్లు, పశువులు కోల్పోయినవారిని, మృతి చెందినవారి కుటుంబీకులను ఆదుకునేలా ఆర్థికసాయం అందించటానికి గాను ప్రభుత్వం రూ.210 కోట్ల మేర నిధులు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో 50 సెం.మీ. దాకా వర్షం కురిసి తీవ్ర నష్టాలను కలిగించిందన్నారు.

తేరుకోని విల్లుపురం, కడలూరు జిల్లాలు...

ఫెంగల్ తుఫాను ఆదివారం మధ్యాహ్నం పూర్తిగా తీరం దాటి కేరళ వైపు మళ్ళినా విల్లుపురం, కడలూరు జిల్లాల్లో వరద పరిస్థితులే కొనసాగుతున్నాయి. కళ్ళకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాల్లోనూ కురిసిన భారీ వర్షాలకు ఆ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విల్లుపురం, కడలూరు జిల్లాల్లో ప్రధాన చెరువులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి.

విల్లుపురం జిల్లాలో రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు తెన్‌పెన్నై, కోరైయారు వాగుల్లో వరద పరిస్థితి నెలకొంది. ఆ రెండు వాగులు పొంగడంతో మారంగియూరు, సేత్తూరు, పయ్యూరు, కొంగనారాయణూరు గ్రామలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పయ్యూరు ఫ్లైవర్ వైపు వెళ్లే దారి వరద ఉధృతికి తెగిపోయింది. ఇదే విధంగా శంకరాభరణి వాగుకు గండ్లు పడటంతో రహదారులను ముంచెత్తింది. దీంతో చెన్నై తిరుచ్చి రహదారి వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

ధర్మపురిలో...

ధర్మపురి జిల్లాలో తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసి ధర్మపురిలోని అన్నై సత్యానగర్, ఆవిన్ నగర్, నంది నగర్ ప్రాంతాల్లోని నివాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇదే విధంగా ఆరూరు, బొమ్మిడి, పాపిరెడ్డిపట్టి, పాప్పారపట్టి, పెన్నగరం, పాలకోడ, కారిమంగళం తదితర ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి.

విల్లుపురం జిల్లా తెన్‌పెన్నైయారులో నీటి ఉధృతి



కడలూరులో వరద ...

ఫెంగల్ తుఫాన్ కారణంగా కుండపోత వర్షాలకు అతలాకుతలమైన కడలూరు జిల్లాలో ప్రస్తుతం వరద పరిస్థితి అలాగే ఉంది.. ఆ జిల్లాలో ఐదువేలకు పైగా నివాసాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. సాత్తనూరు డ్యామ్ నుంచి అదనపు జలాలు విడుదల కావటంతో తెన్‌పెన్నైయారులోకి నీరు చేరటంతో కడలూరు జిల్లాలోని పలు ప్రాంతాలు వరద నీటిలో మునిగాయి. కడలూరు, బన్రుట్టి, నైవేలి, విరుదాచలం, దిట్టకుడి, చిదంబరం, కాట్టుమన్నార్‌కోవిల్ వేపూరు తదితర ప్రాంతాలతోపాటు కడలూరు కార్పొరేషన్ పరిధిలోని ముత్తయ్యనగర్ జనావాస ప్రాంతాలన్నీ వరదనీటి ప్రవాహంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో కడలూరు జిల్లాలో పాఠశాలలు, కళాశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. తిరువణ్ణామలై జిల్లాలోనూ ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీగా వర్షాలు కురిశాయి.

వరద ప్రాంతాల్లో
ముమ్మరంగా సహాయక చర్యలు

● పరిశీలించిన సీఎం స్టాలిన్
● నష్ట వివరాల సేకరణ ● బాధితులకు సాయం పంపిణీ

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ బాధిత జిల్లాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం పరిశీలించారు. ఈ తుఫాను కారణంగా విల్లుపురం, చెంగల్పట్టు, కడలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో అపారనష్టం వాటిల్లింది. దీంతో సీఎం స్టాలిన్ సోమవారం చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం జిల్లాల్లో పర్యటించి నష్ట వివరాలను సేకరించారు. పలు ప్రాంతాల్లో వర్ష బాధితులక సహాయాలను అందజేశారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాత ఫెంగల్ అనే తుపానుగా మారి, గత నెల 30వ తేదీ మహాబలిపురం - పుదుచ్చేరి మధ్య తీరాన్ని దాటింది. దీంతో చెన్నై, తిరువళ్ళూరు, చెంగల్పట్టు, కాంచీపురం, విల్లుపురం, పుదుచ్చేరిలో అతి భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా తీరం దాటిని తర్వాత కుండపోత వర్షం కురిసింది. చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, చెంగల్పట్టు, కళ్ళకుర్చి, తిరువణ్ణామలై, కృష్ణగిరి జిల్లాల్లో ఏకంగా 50 సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. దీంతో ఆయా జిల్లాల్లో గత రెండు రోజులుగా ప్రజాజీవనం స్తంభించిపోయింది. తిరువణ్ణామలైలో కొండ చరియలు విరిగిపడి ఏడుగురు మృతి చెందారు. అనేక ఇళ్ళు ధ్వంసమయ్యాయి. అనేక ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఈ కొండ కింద నివసించే వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో చెరువులు, కుంటలు దాదాపుగా నిండిపోయాయి. వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు గండిపడటంతో వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విల్లుపురం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సహా మంత్రులు సెంథిల్ బాలాజీ, పొన్ముడి, శివశంకర్ మరక్కాణం, కోట్టకుప్పం, విల్లుపురం జిల్లాల్లో మకాం వేసి వరద సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నారు. విల్లుపురం, కడలూరు జిల్లాలో అంతరాయం ఏర్పడిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 500 మంది సిబ్బందిని రంగంలోకి దించి పనులు చేయిస్తున్నారు.



బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఎం





బాధితురాలికి సహాయాలను అందిస్తున్న స్టాలిన్

ఈసీఆర్ మీదుగా...

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ఉదయం 8 గంటలకు చెన్నై, ఈసీఆర్ మీదుగా విల్లుపురం జిల్లా మరక్కాణం చేరుకున్నారు. మార్గమధ్యంలో మహాబలిపురంలో వర్ష బాధిత జాలర్లను పరామర్శించారు. ఆ తర్వాత మరక్కాణం మండవాయ్‌పుదు కుప్పం చేరుకుని శిబిరాల్లో ఉన్న బాధితులను పరామర్శించారు. వారికి సహాయాలను పంపిణీ చేశారు. అనంతరం విల్లుపురం ఈస్ట్ పాండి రోడ్డులోని కమ్యూనిటీ హాలులో ఉన్న బాధిలను పరామర్శించారు. అదేవిధంగా, ఉళుందూరుపేట టోల్‌గేట్ వద్ద శిబిరంలోని బాధితులను పరామర్శించి వారికి అవసరమైన సహాయాలను అందజేశారు. సీఎం స్టాలిన్ వెంట పలువురు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులున్నారు.

ఆ జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులు

ఫెంగల్ తుఫాన్ కారణంగా అపారనష్టం వాటిల్లిన కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల్లో చేపట్టే సహాయక చర్యల పర్యవేక్షణకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇన్‌చార్జ్ మంత్రులను నియమించారు. కృష్ణగిరి జిల్లాకు మంత్రి ముత్తుస్వామి, ధర్మపురి జిల్లాకు ఆర్.రాజేంద్రన్‌ను ఇన్‌చార్జ్ మంత్రులుగా నియమించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఇన్‌చార్జ్ మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

2 రోజులు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

● టంగ్‌స్టన్ సొరంగం రద్దుపై తీర్మానం ● స్పీకర్ అప్పావు వెల్లడి

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయనున్నట్లు శాసనసభ స్పీకర్ అప్పావు వెల్లడించారు. ఇదే అంశంపై చర్చించేందుకు సోమవారం స్పీకర్ అప్పావు అధ్యక్షతన బీఏసీ సమావేశం సోమవారం జరిగింది. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 9, 10వ తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయని, ఈ ఖనిజ తవ్వకాలను రద్దు చేయాలని కోరుతూ తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.



ఈ తీర్మానం చేసేందుకే రెండు రోజుల పాటు అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరుస్తున్నామని, ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరుకావాలని స్పీకర్ అప్పావు కోరారు. ఈ తీర్మానం ప్రతిని కేంద్రానికి పంపిస్తామని ఆయన వెల్లడించారు. రెండు రోజుల సమావేశాల్లో తొలి రోజున అదనపు ఖర్చుల కోసం నిధుల కేటాయింపుపై ఆర్థిక మంత్రి పద్దు ప్రవేశపెట్టి ఆమోదిస్తారన్నారు. రెండో రోజు ఖనిజ సొరంగం తవ్వకం పనులకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఆయన వెల్లడించారు. మదురై జిల్లాలో ఖనిజ తవ్వకాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా కేంద్రం అనుమతులిచ్చింది. వీటిని రద్దు చేయాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలతో పాటు బీజేపీయేతర రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

నిర్మలమ్మతో మంత్రి తంగం తెన్నరసు భేటి

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు సోమవారం ఉదయం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. పార్లమెంటు ప్రాంగణంలో ఉన్న ఆర్థికమంత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, జీఎస్టీ వాటా తదితర అంశాల గురించి చర్చించినట్లు తెలిసింది. అంతేగాక గత ఏడాది సంభవించిన తుఫాను నివారణ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని తెన్నరసు ఆర్థిక మంత్రిని కోరినట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి.



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి తంగం తెన్నరసు

వెయ్యిమంది అన్నామలైలు వచ్చినా
ఫలితం శూన్యం

● రాష్ట్రంలో ద్రావిడ పాలనే కొనసాగుతుంది
● మంత్రి పీకే శేఖర్ బాబు

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెయ్యిమంది పరాజిత అన్నామలైలు వచ్చినా ఫలితం శూన్యమని, రాష్ట్రంలో ద్రావిడ పాలనే కొనసాగుతుందని రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు జోస్యం చెప్పారు. చెన్నై నగర పాలక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ఒక పరాజిత రాజకీయ నేత అని అన్నారు. మాకు డిగ్రీలు ఉన్నాయి... మాలో విద్యాబుద్ధులు కూడా మెండుగా ఉన్నాయన్నారు. పేద, మధ్యతరగతి ఇలా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ముందుకు సాగుతున్నారన్నారు. వర్షాల రాకముందే అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల రక్షణార్థం ముందుస్తు చర్యలు తీసుకున్నారన్నారు.

అన్నామలైకు ఘనస్వాగతం

● కమలాలయంలో బీజేపీ శ్రేణుల సందడి

ప్యారీస్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లండన్ నుంచి మూడు నెలల అనంతరం సోమవారం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. టి.నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అన్నామలైకు గజమాలతో సత్కరించారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో అంతర్జాతీయ రాజకీయశాస్త్రం చదివేందుకు ఆగస్టు 28న వెళ్లిన అన్నామలై మూడు నెలల కోర్సు పూర్తి కావడంతో ఆదివారం నగరానికి చేరుకోగా బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. వెంటనే కోయంబత్తూర్ చేరుకున్న అన్నామలై అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సోమవారం తిరిగొచ్చారు. ఉదయం 10గంటలకు కమలాలయం చేరుకున్న అన్నామలైకు బీజేపీ నేతలు ఘనంగా ఆహ్వానించారు.



అన్నామలైకు గజమాలతో సత్కారం

సమాచార దర్శిని

క్రికెట్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎస్కే అకాడమి, తిరువళ్లూర్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో పాఠశాలల మధ్య 'లీగ్ కమ్ నాకౌట్' పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో తిరువళ్లూర్ జిల్లాకు చెందిన 15 ఏళ్లలోపు వారు మాత్రమే పాల్గొనాలి. 2009 సెప్టెంబరు 1వ తేది ముందు జన్మించినవారై ఉండాలి. అంబత్తూర్ రోడ్డులో తిరువళ్లూర్ జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో ఈ నెల 14వ తేదిలోపు పేర్లు నమోదుచేసుకోవాలి. వివరాలకు 9840482220, 9444329232 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

తాలూకా స్థాయిలో ప్రత్యేక రుణ మేళా

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో 'టాంకో' ఆధ్వర్యంలో తాలూకా స్థాయిలో రుణ మేళా జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభు శంకర్ విడుదల చేసిన ప్రకటనలో... మైనార్టీ వర్గాల ఆర్థిక స్థితి మెరుగుపరిచేలా 'టాంకో' ఆధ్వర్యంలో వ్యక్తులకు, గ్రూపులు వ్యాపారాలు చేసుకొనేలా రుణాలు అందిస్తున్నారు. ఆ ప్రకారం, తిరువళ్లూర్ తాలూకాలో ఈ నెల 6న, ఆవడిలో 9, పూందమల్లిలో 11, ఊత్తుకోటలో 13, పొన్నేరిలో 16, గుమ్మిడిపూండిలో 18, తిరుత్తణిలో 20, ఆర్కే పేటలో 23, పళ్లిపట్టు తాలూకాలో 26వ తేది రుణా మేళాలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

నేడు పనిచేయనున్న వండలూరు జూ

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్‌లో సింహం, పులి, ఏనుగు, ఎలుగు బంట్లు, జింకలు, పక్షులను పర్యవేక్షిస్తున్నారు. ఈ పార్క్‌లో వారాంతపు నిర్వహణ కోసం మంగళవారం సెలవు ఉంటుంది. ఫెంగల్ తుపాను కారణంగా గత నెల 29,30 తేదీల్లో పార్క్ మూసివేశారు. మంగళవారం పార్క్ యధావిధిగా పనిచేస్తుందని పార్క్ అధికారులు తెలిపారు.

వాణిజ్య పన్ను దాఖలుకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత 2024-24వ సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్ను దాఖలుకు అదనంగా మరో 15 రోజులు అవకాశం కల్పించారు. ఈ గడువు గత నెల 30వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, వాణిజ్య పన్నుదారుల విజ్ఞప్తి మేరకు పన్ను దాఖలకు ఈ నెల 15వ తేది వరకు పొడిగించినట్లు అధికారులుతెలిపారు.

6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ గృహవసతి కార్పొరేషన్‌లో ఏఈ పోస్టుల భర్తీకి ఈ నెల 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టుల (నాన్ ఇంటర్వ్యూ) భర్తీకి జనవరి 6వ తేది నిర్వహించిన రాత పరీక్షా ఫలితాలు అక్టోబరు 25వ తేది విడుదల చేశారు. ఈ పోస్టులకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 6వ తేది బ్రాడ్‌వే సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగనుంది. అభ్యర్థులకు తేది, సమయం తదితర వివరాలతో కాల్ లెటర్స్ పంపించామని, మరిన్ని వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

10 నుంచి గ్రూప్-1 మెయిన్స్

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి మెయిన్స్ ఈ నెల 10వ తేది నుంచి ప్రారంభం కానుంది. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-1 విభాగంలో ఖాళీగా ఉన్న 90 పోస్టుల భర్తీకి మార్చి 28న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రిలిమినరీ పరీక్ష జూలై 13వ తేది నిర్వహించగా, 1,59,973 మంది హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకన పనులు 50 రోజుల్లో పూర్తిచేసి సెప్టెంబరు 2వ తేది ఫలితాలు విడుదల చేశారు. ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ నెల 10 నుంచి 13వ తేది వరకు మెయిన్స్ జరుగనున్నాయి. ఈ పరీక్ష చెన్నైలో మాత్రమే నిర్వహిస్తుండగా, ఎంపికైన అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు తమకు కేటాయించిన కేంద్రానికి ఉదయం 8.30 గంటల్లోగా హాజరుకావాలి. అభ్యర్థులు పరీక్షల్లో బ్లాక్ ఇంక్ మాత్రమే వినియోగించాలని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

పంట బీమా పథకంలో రూ.378 కోట్లు చెల్లింపు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో 1.76 లక్షల మంది రైతులకు రూ.378 కోట్లు పరిహారంగా అందజేసినట్లు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభు శంకర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... సవరించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో 201617 నుంచి 2023-24 వరకు 1,76,273 మంది రైతులకు రూ.378.08 కోట్లు పరిహారంగా అందజేశామన్నారు. అలాగే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంబా సాగుకు 12,787 మంది రైతులకు రూ.14.72 కోట్లు, రబి సీజన్‌లో 140 మంది రైతులకు రూ.0.27 కోట్లు పరిహారాన్ని వారి బ్యాంక్ ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో 1,020 మంది రైతులు 3,292 ఎకరాలు, సంబా సీజన్‌లో ఇప్పటివరకు 19,050 మంది రైతులు 52,886 ఎకరాల పంట బీమా చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడి హత్య

● ప్రియురాలి సోదరుడు సహా ఇద్దరి అరెస్టు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో తన చెల్లిని ప్రేమించిన యువకుడిని కత్తులతో దాడి చేసి దారుణంగా హతమార్చిన సోదరుడిని, హత్యకు సాయపడిన అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పాళయంకోట పోలీసుల విచారణలో వెల్లడైన సమాచారం మేరకు కళ్లకురిచ్చి జిల్లాకు చెందిన విజయ్ (25) అనే యువకుడికి నాగర్‌కోవిల్‌లో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువతితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరి ప్రేమ గురించి తెలుసుకున్న యువతి సోదరుడు పుష్పరాజ్, కుటుంబీకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో నాలుగు రోజుల క్రితం ఆ యువతి ఇంటిలో చెప్పకుండా విజయ్ ఇంటికి వెళ్ళి అతడి కుటుంబీకులను కలుసుకుని తామిద్దరమూ ప్రేమించుకుంటున్నామని, పెళ్ళికి అంగీకరించమని వేడుకుంది. యువతి తరపు కుటుంబీకులు అంగీకరిస్తేనే విజయ్‌తో పెళ్ళి జరిపిస్తామని ఆమెను వెళ్లిపొమ్మని చెప్పారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆ యువతి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ యువతి సోదరుడు పుష్పరాజ్ ఆగ్రహించి విజయ్‌ని హతమార్చాలని పథకం వేసుకున్నాడు. ఆ మేరకు తిరునల్వేలిలో తన స్నేహితుడు శివా ఇంటికి వస్తే తన పెద్దలతో మాట్లాడి పెళ్ళి జరిగేలా చేస్తానని విజయ్‌ని నమ్మించాడు. ఆ మాటలు నమ్మి విజయ్ సోమవారం ఉదయం తిరునల్వేలి పాళయంకోట శాంతినగర్ అన్నానగర్‌లో ఉన్న అతడి స్నేహితుడు శివా ఇంటికి వెళ్ళాడు. పుష్పరాజ్, శివా కలిసి ఆ ఇంటి మిద్దెపైనున్న గుడిసెలోకి విజయ్‌ని తీసుకెళ్ళి మాట్లాడారు. తన ఇంట్లో ప్రేమ పెళ్ళికి అంగీకరించరని పుష్పరాజ్ చెప్పాడు. దీనితో విజయ్ అతడితో గొడవపడ్డాడు. పెళ్ళికి రాజీ కుదుర్చుతాననని చెప్పి తనను మోసగిస్తారా అంటూ విజయ్ వారిని దుర్భాషలాడటంతో పుష్పరాజ్, శివా కత్తులతో అతడిపై దాడి చేసి హతమార్చి అక్కడి నుంచి పారిపోయారు. కత్తిపోట్లకు గురైన విజయ్ కేకలు విని ఇంటి చుట్టుపక్కల వారంతా ఆ మిద్దెపైకి వెళ్ళి గుడిసెలో చూడగా రక్తపు మడుగులో విజయ్ పడి ఉండటంతో దిగ్భ్రాంతి చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాళయం కోట పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విజయ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు. విజయ్‌ని హతమార్చి మిద్దె ఇంటి నుండి పుష్పరాజ్, శివా పారిపోయినట్లు స్థానికులు పోలీసులకు సాక్ష్యం చెప్పటంతో ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ఇరువురిని అరెస్టు చేశారు.



హత్య జరిగిన గుడిసెను పరిశీలిస్తున్న పోలీసులు

మరణంలోనూ వీడని బంధం

● ఒకేరోజు కన్నుమూసిన వృద్ధ దంపతులు

● కృష్ణగిరి జిల్లాలో ఘటన

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల పాటు కలిసి కాపురం చేసిన దంపతుల్ని మృత్యువు కూడా విడదీయలేకపోయింది. ఆద్యంతం అన్యోన్యంగా గడిపిన ఆ దంపతులు ఒకేరోజు రాత్రి నిద్రలోనే మరణించడం పలువురిని కలసివేసింది. వివరాలిలా... కృష్ణగిరి జిల్లా డెంకణికోట సమీపంలోని మేగలపుండనూరు గ్రామానికి చెందిన గోవిందస్వామి (90), రామక్క (75) దంపతులకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారు. అందరికి వివాహమై వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గోవిందస్వామి పిల్లలు కొంతమంది తల్లిదండ్రుల కు ఆహారం అందించి వెళ్లారు. అయితే రాత్రి నిద్రపోయిన దంపతులు ఆదివారం ఉదయం ఎంతసేపటికీ లేవలేదు. దీంతో ఇరుగుపొరుగు వారు లేపేందుకు ప్రయత్నించగా, అచేతనంగా పడివున్నారు. అప్పటికే వారిద్దరూ తుదిశ్వాస విడిచినట్లు తేలింది.

చెరకుతోటలో స్కూలు బస్సు బోల్తా

● పది మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాద స్థలం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అమ్మాపేట వద్ద సోమవారం ఉదయం స్కూలు బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెరకుతోటలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 10 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. అమ్మాపేట సమీపంలోని ఓ ప్రైవేటు స్కూలులో చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారు. ప్రతిరోజూ వీరిని తీసుకెళ్లేందుకు స్కూలు బస్సు వస్తుంది. సోమవారం ఉదయం గుణశేఖరన్ అనే డ్రైవర్ విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని బయలుదేరాడు. ఆ బస్సు ఉమారెడ్డియూరు రహదారిలో వెళ్తుండగా ఓ మలుపు వద్ద అదుపు తప్పి చెరకుతోటలో బోల్తాపడింది. బస్సులో ఉన్న 10 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. అమ్మాపేట పోలీసులు అంబులెన్స్‌తో వెళ్ళి గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రఆందోళనకు గురయ్యారు.

కోవైలో పరోటా తిన్న మెడికో మృతి

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లాలో పరోటా తిన్న వైద్యకళాశాల విద్యార్థిని కీర్తన మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతి కలిగించింది.తుడియలూరు సమీపం తోప్పంబట్టి డివిజన్‌లోని ఓ అపార్ట్‌మెంట్లో నివసిస్తున్న త్యాగరాజన్ కుమార్తె కీర్తన (22) కర్పగం వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. కీర్తన ఆదివారం రాత్రి పరోటా తిని తన గదిలో నిద్రపోయింది. సోమవారం ఉదయం కీర్తన తల్లిదండ్రులు ఆమె గదికి వెళ్లి పరిశీలించగా స్పృహతప్పి కనిపించడంతో దిగ్భ్రాంతి చెందారు. ఆమెను వెంటనే కోవై ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ఘటనపై తుడియలూరు పోలీసులు కేసు నమోదు చేసి, కీర్తన తిన్న పరోటాలు ఎక్కడ తయారుచేశారు, పరోటాలో ఏమైనా కలిపారా అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

నగరంలో 408 లో ఫ్లోర్ బస్సులు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇప్పటి వరకు 78 మార్గాల్లో 408 లో ఫ్లోర్ బస్సులు నడుపుతున్నట్లు మెట్రోపాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) అధికారులు తెలిపారు. నగరంలో పలు కారణాలతో ఆరేళ్ల క్రితం లో ఫ్లోర్ బస్సులు నిలిపివేశారు. ఈ క్రమంలో, దివ్యాంగుల సౌకర్యార్థం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 611 లో ఫ్లోర్ బస్సులను రవాణాశాఖ ఎంటీసీకి కేటాయించింది. తొలివిడతగా 58 బస్సులను గత ఆగస్టులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ప్రస్తుతం పలు విడతలుగా ఇప్పటివరకు 409 బస్సులను 78 మార్గాల్లో నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

నీటమునిగి బాలుర మృతి

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపం వలయకాడుకుండ్రం గ్రామానికి చెందిన మాధవన్ కుమారుడు ప్రదీప్ (3), చెంగం సమీపం పడిఅగ్రహారం వేడియప్పన్ నగర్‌కు చెందిన పళని కుమారుడు లోకేష్‌సమీపంలో వాగులో స్నానాలకు వెళ్లారు. ఊహించని విధంగా లోతైన ప్రాంతాలకు వెళ్లిన ఇద్దరు నీట మునిగారు. చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని వాగులో గాలించి మృతదేహాలు వెలికితీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆగిన కారులో మృతదేహం!

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం పోలీస్‌స్టేషన్ వెనుక వైపు నిలిపిన కారులో కుళ్లిన స్థితిలో పురుషుడి మృతదేహం ఉండడం కలకలం రేపింది. రాజగోపాల్ వీధి ప్రాంతంలో బీఎండబ్ల్యూ కారు కొన్ని రోజులుగా ఆగి ఉంది. ఈకారు నుంచి సోమవారం ఉదయం దుర్వాసన రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి కారులో పరిశీలించగా కుళ్లిన స్థితిలో ఉన్న పురుషుడి మృతదేహాన్ని గుర్తించి, కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ కారు పుదుచ్చేరి రిజిస్ట్రేషన్‌తో ఉంది. ఈ కారు ఎన్ని రోజుల నుంచి వుంది? మృతుడు మద్యం మత్తులో కారులో నిద్రించి మృతిచెందాడా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

వర్షపు నీటిలో విద్యార్థుల అవస్థలు



నీళ్లలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుముల్లైవాయల్‌లోని పాఠశాల ప్రాంగణంలో చేరిన వర్షపు నీటితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచింది. దీంతో, సోమవారం వర్షపు నీటిలోనే విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లారు. వర్షపు నీటితో దోమలు అధికమై అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని, అధికారులు సత్వరం నీరు తొలగించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కడలూరు మీదుగా నడిచే మూడు రైళ్ల రద్దు

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కడలూరు, చిదంబరం మీదుగా వెళ్లే మూడు రైళ్లను దక్షిణ రైల్వే సోమవారం రద్దు చేసింది. విల్లుపురం సమీపంలోని ముండియంపాకం రైల్వే స్టేషన్‌కు, విక్రవాండి రైల్వే స్టేషన్‌కు మధ్య రైలు వంతెన కింద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా దక్షిణ రైల్వే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తిరుచ్చీ నుంచి చెన్నై బయలుదేరాల్సిన చోళన్ సూపర్‌ఫాస్ట్ రైలు, చెన్నై నుంచి తిరుచ్చికి వెళ్ళే చోళన్ సూపర్‌ఫాస్ట్ రైలు, కోయంబత్తూర్ నుంచి తాంబరం వరకు వెళ్లే ప్రత్యేక రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు లేక కడలూరు రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా కనిపించింది. మరో వైపు రామేశ్వరం నుంచి అయోధ్య వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను చిదంబరం రైల్వేస్టేషన్‌లో సుమారు గంటకు పైగా నిలిపి వేశారు.

16 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని రైలు పట్టాలపై వర్షపునీరు వరదలా ప్రవహించడంతో ఆ మార్గం మీదుగా దక్షిణాది జిల్లాలకు వెళ్లే రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. విక్రవాండి - ముండియంబాక్కం మధ్యనున్న రైలు పట్టాలపై రెండు అడుగుల మేర వర్షపు నీరు వరదలా ప్రవహించడంతో చెన్నై ఎగ్మూరు- నాగర్‌కోవిల్, తిరునల్వేలి, మదురై, తిరుచ్చి, తెన్‌కాశి, రామేశ్వరం మధ్య నడిచే రైళ్లు అక్కడక్కడా నిలిపివేశారు. ఈ కారణంగా సోమవారం చెన్నై నుండి దక్షిణాది జిల్లాల వైపు వెళ్లే 16 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. రద్దయిన రైళ్లలో ఎగ్మూరు నుంచి నాగర్‌కోవిల్‌కు బయల్దేరే వందే భారత్, ఆరుగంటలకు మదురై వెళ్లే తేజస్ రైలు, పుదుచ్చేరి మెము ఎక్స్ ప్రెస్ కూడా ఉన్నాయి.

రాజధాని కళాశాల విద్యార్థి హత్య

● నలుగురు విద్యార్థులకు బెయిలు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని కళాశాల విద్యార్థి హత్య కేసుకు సంబంధించి, పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు నలుగురికి నిబంధనలతో కూడిన బెయిలిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపం పొన్‌వాడి ప్రాంతానికి చెందిన ఎ.సుందర్ (19) రాజదాని కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు సుందర్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సుందర్ రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పెరియమేడు పోలీసులు కేసు నమోదుచేసి ఐదుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. సుందర్ మృతిచెందడంతో హత్య కేసుగా మార్చారు. ఈ కేసు సోమవారం విచారణకు వచ్చిన నేపథ్యంలో, పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు నలుగురికి నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేశారు. ఇద్దరు విద్యార్థులు రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేయాలని, మిగిలిన ఇద్దరు కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రిలో పనిచేయాలని నిబంధన విధించింది.

నాలుగు జిల్లాల్లో నిండిన చెరువులు

ఐసిఎఫ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. పాలారు వాటర్ షెడ్ ప్రాజెక్ట్ కింద కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో 1,644 చెరువులుండగా, 277 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. వీటిలో శనివారం ఒక్కరోజు మాత్రమే 141 చెరువులు నిండడం గమనార్హం.

రెండు కిలోల బంగారంతో నగల వ్యాపారి కిడ్నాప్

ఐసిఎఫ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి రెండు కిలోల బంగారంతో వెళ్లిన వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఘటనలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. రామనాథపురం జిల్లాకు చెందిన నగల వ్యాపారి బాలసుబ్రమణ్యం (60) చెన్నై వచ్చి బంగారు ఆభరణాలు కొనుగోలుచేసి మదురై సహా పలు ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఘటన జరిగిన రోజున బాలసుబ్రమణ్యం 2 కిలోల నగలతో నగరంనుంచి మదురై వెళ్లాడు. రైల్వేస్టేషన్‌నుంచి బయటకు వస్తున్న అతడిని కొందరు కిడ్నాప్ చేశారు. అతడినుంచి బంగారం దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టినతిలగర్‌తిడల్ పోలీసులు, నగరానికి చెందిన నగల ఏజెంట్, అతడి అనుచరులు ఈ దోపిడీకి పాల్పడ్డారని గుర్తించి, ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా జల్లికట్టు బహుమతులు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు పోటీల విజేతలకు ఇచ్చే బహుమతులు వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా ఉండాలనే పిటిషన్ పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మదురై బెంచ్ నోటీసులు జారీచేసింది. అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్ జల్లికట్టు పోటీల్లో కారు, బైక్ తదితర బహుమతులు అందించడంపై నిషేధం విధించాలని హైకోర్టులో న్యాయవాది మునగిరి సెల్వకుమార్ దాఖలుచేసిన పిటిషన్ సోమవారం విచారించిన హైకోర్టు, ఈ విషయమై పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసి, కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

'బ్రీత్ ఎనలైజర్లు' కొనుగోలు చేయనున్న రవాణా శాఖ

పెరంబూర్, డిసెంబరు 2: రవాణా శాఖలో డ్రైవర్లు విధుల్లో మద్యం సేవిస్తున్నారని ఆరోపణలున్నాయి. మద్యం సేవించిన డ్రైవర్లు నడిపిన బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. జాతీయ రహదారులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మద్యం సేవించే డ్రైవర్లను పరీక్షించేందుకు 339 బ్రీత్ ఎనలైజర్లు కొనుగోలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. బస్సు బయల్దేరే సమయం, మార్గమధ్యంలో ఈపరికరం ద్వారా డ్రైవర్లను పరీక్షించనున్నట్లు, మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

వాహనదారులకు చాక్లెట్లు



వాహన చోదకులకు చాక్లెట్లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ తిరునావుక్కరసు

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఈ నెల 1 నుంచి జిల్లా వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. స్థానిక కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద హెల్మెట్ ధరించిన వాహన చోదకులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తిరునావుక్కరసు చాక్లెట్లు అందజేసి అభినందించారు.

మఠానికి టేబుళ్లు, కుర్చీల వితరణ



మఠం మేనేజర్‌కు చెక్ అందజేస్తున్న రాధాకృష్ణన్

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డు సమీపంలో ఉన్న సాధుకార మఠం సిద్ధుడి పీఠంలో ప్రతిరోజు అన్నదానం జరుగుతోంది. ఈ మఠంలో వృద్ధులు, దివ్యాంగులు కింద కూర్చొని భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో, ఆధ్యాత్మిక స్నేహితుల సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణన్, 25 టేబుల్స్, 80 కుర్చీల కొనుగోలు కోసం రూ.55వేల చెక్‌ను మఠం కోశాధికారి, మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు దీనదయాళన్, మనోహరన్ తదితరులున్నారు.

త్వరలో లబ్ధిదారులకు ఇళ్లు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంత పేదల పునరావాసం కోసం రాజధాని నగరం చెన్నై, కోవైలో నిర్మించిన 8,677 ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నగర ప్రాంత పేదలకు ఇళ్లు నిర్మించిఇస్తున్నారు. ఆ ప్రకారం ఎర్నావూర్‌లో 6,877 ఇళ్లు, కోవై పెరియనాయన్‌పాళయంలో 1,800 ఇళ్లలో కూడిన అపార్ట్‌మెంట్ నిర్మాణాలు ఇటీవల పూర్తయ్యాయి. వీటిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నుంచి అధిక ఆదాయ వర్గాల వరకు ఇళ్లు కేటాయిస్తున్నారు. మధ్యతరగతి వారు బ్యాంకు రుణాల ద్వారా ఈ ఇళ్లు కొనుగోలు చేయవచ్చు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు పరిశీలించి త్వరలో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎనిమిది రోజుల అనంతరం చేపల వేటకు జాలర్లు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా జాలర్లు ఎనిమిది రోజుల అనంతరం సోమవారం చేపల వేటకు బయల్దేరారు. బంగాళాఖాతంలో గత వారం సంభవించిన అల్పపీడనం ప్రభావంతో పాక్ జలసంధి, మన్నార్ వళైగుడ ప్రాంతాల్లో 40 నుంచి 65 కి.మీ వేగంతో బలమలై గాలులు వీస్తుండడంతో జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారులు హెచ్చరించారు. అనంతరం వాయుగుండం ఫెంగల్ తుఫాను గా మారడంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో జాలర్లు తీరానికే పరిమితమయ్యారు. ఫెంగల్ తుఫాను పుదుచ్చేరి వద్ద తీరం దాటడం, సముద్రంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో, మత్స్యశాఖ అధికారుల అనుమతితో రామేశ్వరం సహా పలు గ్రామాల నుంచి సుమారు 5,000 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లారు.



ఘనంగా సమైక్య సేవకుల క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో యూటీఎంఎఫ్ నిర్వాహకులు

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమైక్య తెలుగు క్రైస్తవ సేవకుల (యూటీఎంఎఫ్) ఆధ్వర్యంలో సమైక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేపేరీ హైరోడ్‌లో వున్న సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకల ఏర్పాట్లను యూటీఎంఎఫ్ అధ్యక్షుడు రెవరెండ్ జె. నతానియేలు, ఉపాధ్యక్షులు రెవరెండ్ బి.రవితేజ, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ పి.ఎల్ సాలోమోన్, ఉప కార్యదర్శి రెవరెండ్ ఆర్.శామ్యుయేలు జాన్సన్, ట్రెజరర్ రెవరెండ్ ఆర్. జాన్సన్, అడ్మిన్ రెవరెండ్ వి.ప్రసాద్, కార్యనిర్వాహకులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ పాస్టర్ వి.ప్రేమానందం హాజరై యేసుక్రీస్తు జనన విశిష్టతపై ప్రసంగించారు. ప్రత్యేక అతిథులుగా యూటీఎంఎఫ్ ప్యాట్రన్ రెవరెండ్ చార్లెస్ ఫిన్నిజోసెఫ్, ప్యాట్రన్ రెవరెండ్ కె.బి.ఎడిసన్, రెవరెండ్ ఎస్.విక్టర్ సహా నగరంలోని వివిధ ప్రాంతాల్లోని తెలుగు క్రైస్తవ సంఘాల సభ్యులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే కొయర్ బృందానికి చెందిన యువతీ, యువకులు క్రిస్మస్ పర్వదినానికి ఆహ్వానం పలుకుతూ పాటలను అలరించారు.

కూలిన ఇంటి గోడ...

అదృష్టవశాత్తు బయటపడిన దంపతులు



కూలిన ఇంటి గోడ

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. గుడియాత్తం సమీపం పెరియార్ నగర్‌కు చెందిన సుబ్రమణ్యన్ (76)-రాణి (65) దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరింది. వర్షాలతో నానిన ఇంటి గోడలు ఆదివారం సాయంత్రం హఠాత్తుగా కూలిపడింది. ఈ శబ్దానికి దంపతులు బయటకు రావడంతో పెనుప్రమాదం తప్పిందిత. సమాచారం అందుకున్న గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందరరాజన్, కమిషనర్ మంగైకరసన్‌లు వచ్చి దంపతులను పరామర్శించి, కొత్త ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

తుపాను బాధితులకు సహాయాల పంపిణీ



బాధితులకు సహాయాలు అందజేస్తున్న అధికారులు

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు సమీపం నాగనదిలో ఏర్పడిన వరద ప్రవాహాన్ని ఎమ్మెల్యే నందకుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఆనైకట్టు పంచాయతి యూనియన్ అధ్యక్షుడు కుమార పాండ్యన్, ఉపాధ్యక్షుడు సుందరమూర్తి, జిల్లా పంచాయతి అధ్యక్షుడు బాబు తదితరులున్నారు. అలాగే, గుడియాత్తం సమీపం మూలకొల్లి ప్రాంతంలో వంద ఇళ్లలో వర్షపు నీరు చేరింది. బాధితులను గుడియాత్తం బీడీవో వినోద్‌కుమార్, ఇంజనీర్ నిర్మల, పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు ఆషాదేవి పరామర్శించి, వారికి చాపలు, దుప్పట్లు అందజేశారు.

గాయని ఇసైవాణికి వ్యతిరేకంగా

కోవైలో అయ్యప్పభక్తుల ధర్నా



మేట్టుపాళయం బస్‌స్టేషన్ కూడలిలో ధర్నా చేస్తున్న అయ్యప్ప భక్తులు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శబరిమలై అయ్యప్పస్వామి కీర్తి ప్రతిష్ఠలను కించపరిచే విధంగా పాటలు పాడిన గాయని ఇసైవాణి, ఆ సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దర్శకుడు రంజిత్‌పై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోయంబత్తూరు జిల్లా అంతటా సోమవారం అయ్యప్ప భక్తులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అయ్యప్ప భక్త సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మేట్టుపాళయం బస్‌స్టేషన్ ఎదుట సుమారు రెండు వందల మంది అయ్యప్ప భక్తులు నిరసన ప్రదర్శనలు జరిపారు. ఈ ఆందోళనకు సమాఖ్య సమన్వయకర్త ఉమా శంకర్, అధ్యక్షుడు సెల్వకుమార్ నాయకత్వం వహించారు. సమాఖ్య కార్యదర్శి చంద్రశేఖర్, వారాహి మంత్రాలయం సాక్త వరాహి మణికంఠన్ స్వామి, కల్లారు అగస్త్యపీఠం స్వామి సరోజినీ మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏర్కాడులో సామూహిక హత్యాచారం

● రౌడీ సహా ఇద్దరి అరెస్టు

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఏర్కాడులో ఒక మహిళపై సామూహిక అత్యాచారం చేసి, ఆమెను హత్య చేసి, మృతదేహాన్ని ముళ్ళ పొదల్లో విసిరేశారు. ఈ కేసులో ఒక రౌడీ సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు నామక్కల్ జిల్లా రాశీపురం ప్రాంతానికి చెందిన రాజు అనే వ్యక్తి భార్య మలర్ (43) పొరక కట్టలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 25వ తేదీ నామక్కల్ నుంచి సేలం పట్టణానికి వచ్చిన మలర్.. ఆ రోజు రాత్రికి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీనిపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మలర్ మొబైల్ ఫోన్ ఆధారంగా పోలీసులు ఈ కేసు ఛేదించారు. మలర్ వినియోగించిన ఫోన్ ఏర్కాడు కొండ ప్రాంతానికి వెళ్ళిన తర్వాత స్విచాఫ్ అయినట్టు పోలీసులు గుర్తించారు. అలాగే, మలర్ చివరగా మాట్లాడిన నంబరు ఆధారంగా విచారించగా సేలం జిల్లా కన్నంకుర్చి తామరై నగర్‌కు చెందిన రౌడీ కనకరాజ్‌గా గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెల్లడించారు. మలర్‌పై సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసి మృతదేహాన్ని కొండ ప్రాంతంలో విసిరేసినట్టు తెలిపాడు. ఈ హత్యలో స్నేహితుడు శక్తివేల్ సహకరించినట్టు తేలింది. దీంతో వారిద్దరిని అరెస్టు చేసి, మృతదేహం కోసం గాలిస్తున్నారు.

తిరుచెందూర్‌లో విడిది గృహాల చార్జీల తగ్గింపు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే భక్తులు స్వామివారి దర్శనం తరువాత తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామిని దర్శించుకుంటారు. ఈ ఆలయ పరిధిలోని యాత్రి నివాస్‌లో విడిది గృహాలు అద్దెకు ఇస్తుంటారు. ఇద్దరుండే గదిని సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.1,600-రూ.1,800, శని, ఆదివారాల్లో రూ.1,800-రూ.2,000 చార్జీ వసూలు చేస్తుంటారు. అలాగే, ఏడు పడకలతో కూడిన డార్మెట్రీ సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.3,000 నుంచి రూ.3,500, శని, ఆదివారాల్లో రూ.3,800 నుంచి రూ.4,000, ఉత్సవాల సమయాల్లో రూ.4,200 నుంచి రూ.4,500, 9 పడకల డార్మెంట్రీ హాల్ రూ.500 తగ్గించి సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ.4,000, శని, ఆదివారాల్లో రూ.4,500, ఉత్సవ సమయాల్లో రూ.5,000 వసూలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



విక్రవాండి మార్కెటింగ్ కమిటీ ధాన్యపు గిడ్డంగిలోకి ప్రవేశించిన వరదనీరు





కడలూరు దిట్టకుడిలో ఓ కాలనీలో వరద - మోకాలిలోతు నీటిలో నడిచి వెళ్తున్న వృద్ధుడు

ఫెంగల్ తుఫాన్ ప్రభావిత కుండపోత వర్షాలు మూడు జిల్లాలను ముంచెత్తాయి. విల్లుపురం, కృష్ణగిరి, కడలూరు జిల్లాల్లో 40 నుండి 50 సెం.మీ.లకు పైగా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ఆ జిల్లాల్లో జన జీవనం పూర్తిగా స్తంభించింది. చెరువులు, వాగులు, వంకలు నీటితో నిండి కట్టలు తెంచుకుని జనావాస ప్రాంతాలపై పొంగి ప్రవహిస్తున్నాయి

- చెన్నై,ఆంధ్రజ్యోతి



కడలూరు ముత్తయ్యనగర్‌లో ఇళ్లచుట్టూ మోకాలిలోతున ప్రవహిస్తున్న వర్షపునీరు

చరిత్రలో నిలిచిపోయే పాటలు రాయాలనివుంది

● పొత్తువిల్ అస్మిన్



పొత్తువిల్ అస్మిన్

సినీ గేయరచయిత పొత్తువిల్ అస్మిన్ రాసిన పాటతో పాటు ఆయనకు కూడా మంచి ప్రశంసలు వస్తున్నాయి. 'తిరుంబిపార్' చిత్రంలో పొత్తువిల్ అస్మిన్ ఓ పాటకు సాహిత్యాన్ని అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాలోని 'కన్‌తొరందదు సామి' అనే పాటకు ఆయన సాహిత్యాన్ని అందించారు. ఈ.ఇబ్రహీం దర్శకత్వంలో డాక్టర్ విద్య ప్రదీప్, రిషి రిత్విక్, పేరరసు, గిరిబాబు, నాంజల్ సంపత్, డేనియల్, రాజ్‌కుమార్, అస్మిత సహా అనేక మంది నటించారు. దేవ్ గురు సంగీతం అందించిన ఈ చిత్రానికి వేల్ మురుగన్ నేపథ్యగానం చేశారు. ఈ పాట గురించి పొత్తువేల్ అస్మిన్ మాట్లాడుతూ, "నాన్', 'అరమకావియం', 'సుమ్మావే ఆడువోం', 'ఇది కదైయల్ల నిజం' వంటి అనేక చిత్రాలకు గేయ రచన చేశారు. గత 12 యేళ్ళుగా పాటలు రాస్తున్నాను. తమిళ చిత్రపరిశ్రమకు హీరో విజయ్ ఆంటోనీ పరిచయం చేశారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలితపై రాసిన 'వానే ఇండింద దమ్మా' అనే పాట మెరీనా తీరంలోని ఆమె సమాధి వద్ద రెండు నెలల పాటు వినిపించారు. 'అయో సామి నీ ఎనక్కు వేణాం' పాట ఆరు కోట్ల మందికిపైగా వీక్షించారు. తమిళ చిత్రసీమకు చెందిన సంగీత దర్శకులు, దర్శకులతో పనిచేయాలని కోరుకుంటున్నాను. కవి కన్నదాసన్, వైరముత్తు వంటి గొప్ప గేయరచయితలు రాసిన పాటలు తరహాలోనే నా పాటలు కూడా చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోవాలన్నదే నా కోరిక అని పేర్కొన్నారు.

'సిల్క్‌స్మిత' బయోగ్రఫీ

● వెల్లడించిన ఎస్‌టీఆర్ఐ సినిమాస్

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో ఒక ఐకాన్‌గా వెలుగొందిన శృంగార నటి సిల్క్‌స్మిత జీవిత చరిత్ర ఆధారంగా ఒక చిత్రం తెరకెక్కనుంది. ఈ దివంగత నటి జయంతి సందర్భంగా ఎస్‌టీఆర్ఐ సినిమాస్ ఈ ప్రాజెక్టు చేపట్టనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. 'సిల్క్‌స్మిత - క్వీన్ ఆఫ్ ది సౌత్' పేరుతో ఇది రూపుదిద్దుకోనుంది. జయరామ్ శంకరన్ దర్శకుడు. ఎస్.బి. విజయ్ అమృతరాజ్ నిర్మాణంలో 2025 యేడాది ప్రారంభంలో ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. నిర్మాత విజయ్ అమృతరాజ్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఒక వీడియోలో వెల్లంచారు. ఇందులో సిల్క్‌స్మిత జీవితంలో చోటుచేసుకున్న అనేక ముఖ్య సంఘటనలను ప్రధానంగా పొందుపరచనున్నారు. సిల్క్‌స్మిత పాత్రను చంద్రికా రవి పోషిస్తారని వీడియో సందేశంలో పేర్కొన్నారు.



చంద్రిక



సిల్క్‌స్మిత

చిత్రజ్యోతి

12 నుంచి చెన్నైలో అంతర్జాతీయ చిత్రోత్సవాలు



మీడియా సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

అంతర్జాతీయ చిత్రోత్సవాలకు మరోమారు చెన్నై నగరం వేదిక కానుంది. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సహకారంతో ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శివన్ కణ్ణన్, ఆనంద్ రంగస్వామి, ఏవీఎంకే షణ్ముగం, సురేష్ మీనన్, కుమార్ సోమవారం వెల్లడించారు. నగరంలో జరిగిన మీడియా సమా వేశంలో వారు మాట్లాడుతూ, చిత్రోత్సవ ప్రారంభం , ముగింపు కార్యక్రమాలు రాయపేటలోని పీవీఆర్ సత్యం సినిమాస్‌లో జరుగుతాయని వెల్లడించారు. ఇప్పటివరకు 25 ఎంట్రీలు రాగా, వరల్డ్ సినిమా విభాగంలో 12 ఎంట్రీలు వచ్చాయన్నారు. ఈ 22వ చిత్రోత్సవాల హైలెట్స్ పరిశీలిస్తే, మొత్తం 50 దేశాల నుంచి 123 ఎంట్రీలు వచ్చాయన్నారు. ఈ ఉత్సవాలకు పలు దేశాల రాయబారులు, సినీ ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు.

పూర్తిగా న్యాయం చేయలేదు

● తమన్నా



సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'జైలర్' చిత్రంలోని 'కావాలా...' ప్రత్యేక గీతంలో హీరోయిన్ తమన్నా డ్యాన్స్ అదరగొట్టింది. ఈ పాట ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ పొందింది. అయితే, ఈ పాటకు తాను పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోయానని తమన్నా వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, 'కావాలా' పాటకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయాను. నేను పూర్తిగా భాగస్వామ్యం కాలేకపోయాననే బాధ నాకు ఉంది. ఆ పాటను మరింత మెరుగ్గా చిత్రీకరించివుండొచ్చనే భావన కలిగిందన్నారు. అలాగే, సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా ఈ పాటలో తమన్నాతో కలిసి డ్యాన్స్ చేయలేకపోయానంటూ తన మనసులోని మాట వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఏది ఏమైనా 'జైలర్' చిత్రం విజయంలో తమన్నా ప్రత్యేక గీతం కీలక పాత్ర పోషించిన విషయం తెల్సిందే.

ఊటీ కర్ణాటక ప్రభుత్వ పార్క్‌లో ఫ్లవర్ షో



ఊటీలోని కర్ణాటక ప్రభుత్వ పార్క్

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊటీలో ఉన్న కర్ణాటక ప్రభుత్వ పార్క్‌లో తొలిసారిగా శీతాకాల ఫ్లవర్ షో నిర్వహించనున్నారు. ఊటీ ఫెర్న్ హిల్ ప్రాంతంలో కర్ణాటక ఉద్యానవన శాఖకు 38 ఎకరాల్లో ఉన్న పార్క్‌లో హార్టికల్చరల్ గార్డెన్, రోజ్ గార్డెన్, ఇటాలియన్ గారెన్, టీ గార్డెన్ ఇలా పలు విభాగాలున్నాయి. పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రతి ఏడాది వేసవి, శీతాకాలంలో ఫ్లవర్ షో ఏర్పాటుచేస్తుంటుంది. ఈ నేపథ్యంలో, తొలిసారిగా కర్ణాటక ప్రభుత్వ పార్క్‌లో శీతాకాల ఫ్లవర్ షో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ పార్క్‌లో ఆర్కిడ్, సైక్లోమన్, రెనాన్‌గులస్, ట్యూబెరస్, బెగోనియా, క్రిసాన్థిమం, మేరి గోల్డ్ సహా 200 రకాలకు చెందిన 5 లక్షల పూలు సిద్ధం చేశారు. అలాగే, గ్రీన్ హైస్‌లో 20,000 పూల కుండీలు కూడా ఏర్పాటయ్యాయి. ఈ పార్క్‌లో ప్రవేశానికి రూ.100 వసూలుచేస్తున్నారు. అదే సమయంలో ఊటీలోని పలు పర్యాటక ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలుచేస్తుండగా, కర్ణాటక ప్రభుత్వ పార్క్‌లో మాత్రం పార్కింగ్ ఫీజు లేదు. ఈ క్రమంలో, శీతాకాల ఫ్లవర్ షో ఈ నెల 3వ వారంలో నిర్వహించాలని నిర్ణయించనున్నట్లు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులను ఆహ్వానించినట్లు ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు.

నీలగిరి జిల్లాలో కుండపోత

● ఊటీ కొండరైలు రద్దు



ఊటీ రైల్వేస్టేషన్ ప్రాంతంలో రహదారులపై ప్రవహిస్తున్న వరదనీరు

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వర్షాలకు జన జీవనం స్తంభించింది. రహదారులలో వర్షపునీరు వరదలా ప్రవహించింది. వర్షాల కారణంగా జిల్లాలోని ఊటీ, కొత్తగిరి, గూడలూరు తాలూకాలలోని పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. భారీ వర్షాల కారణంగా ఊటీ హిల్‌ట్రైన్ సర్వీసు రద్దు చేశారు. మంగళవారం కూడా ఆ రైలు సర్వీసు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు భారీ వర్షాలు కురవటంతో ఊటీ బోట్‌హౌస్ ప్రాంతం జలమయమైంది. వర్షాల కారణంగా ఊటీలోని రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వర్షానికి తోడు దట్టమైన మంచుకూడా కురవటంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. జిల్లాలోని గూడలూరు 73.మి.మీ., ఊటీలో 40.8 మి.మీ., కెట్టిలో 5 మి.మీ., పందలూరులో 19 మి.మీ., కోడనాడులో 71 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



సోమవారం చెన్నైలో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గీతాజీవన్ చేతుల మీదుగా లాప్‌టాప్‌లు అందుకున్న అంధత్వాన్ని అధిగమించి, పీజీ, పీహెచ్‌డి చదువుతున్న విద్యార్థులు

నీటమునిగిన వరి.. అన్నదాతల వర్రీ



తిరుత్తణి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో తిరువలంగాడు ప్రాంతంలో 200 ఎకరాల్లో వరి పంట నీటిమునిగింది. తుఫాను కారణంగా పళ్లిపట్టు, తిరుత్తణి, ఆర్కే. పేట సహా పలు ప్రాంతా ల్లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, చెరువులు, వాగులు నిండుతున్నాయి. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు, వారికి నిత్యావసర సహాయాలు అందజేస్తున్నారు. వర్షాల కారణంగా తిరువలంగాడు యూనియన్ పరిధిలోని మనవూరు, రాజపద్మాపురం తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న సుమారు 200 ఎకరాల్లో వరి నీటమునిగిందని, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండ రైలు అద్దెకు తీసుకొని విదేశీయుల విహారం

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేట్టుపాళయం నుంచి కున్నూర్‌కు రూ.6 లక్షల అద్దె చెల్లించి, కొండ రైలులో విదేశీ పర్యాటకులు ప్రయాణించారు. మేట్టుపాళయం-కున్నూర్-గెత్తి మధ్య శతాబ్దాల చరిత్ర కలిగి 'యునెస్కో' గుర్తింపు పొందిన కొండ రైలులో ప్రయాణించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, ఇంగ్లాండ్‌కు చెందిన 12 మంది, ఆసేలియాకు చెందిన ఇద్దరు మొత్తం 16 మంది పర్యాటకులు, రూ.6 లక్షలు అద్దె చెల్లించి ఆదివారం మేట్టుపాళయం-కున్నూర్ మధ్య కొండ రైలులో ప్రయాణించారు. మార్గమధ్యంలో కొండల మధ్య వంతెనలు, ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ విదేశీయులు ఆహ్లాదంగా గడిపారు.



ఊటీ అందాలు వీక్షిస్తున్న విదేశీయులు

ఘనంగా మార్గళి వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న డ్యాన్సర్లు, నిర్వాహకులు

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీఆర్టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో మార్గళి వేడుకలను 'మరుపురాని మార్గళి' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి అండ్ సరస్వతి ఈవెంట్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాంప్ వాక్ ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది. ఇందులో పాల్గొన్న మోడల్స్ జీఆర్‌టీ జ్యూవెలర్స్ తయారు చేసిన ఆభరణాలు, స్నేహాలయ సిల్క్స్‌కు చెందిన చీరలు, కుర్తాలు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. మీనంబాక్కంలోని నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ వేడుకలను నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు, దౌత్యవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఎంతో ఉత్సాహభరితంగా సాగిన ఈ వేడుక మరపురాని కార్యక్రమంగా మిగిలిపోయింది. ఇందులో అనేక మంది సింగర్స్, డ్యాన్సర్లు, మ్యూజీషియన్లు పాల్గొని సంగీతం, నృత్యంతో పాటు వివిధ రకాలైన కళలను ప్రదర్శించారు.

నాగూర్ దర్గాలో
ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా నాగూర్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన దర్గా 468వ ఉరుసు ఉత్సవాలు సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు, పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన అంశమైన పవిత్ర గంధం పాత్ర ఊరేగింపు ఈ నెల 11న జరిపేందుకు దర్గా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. నాగూర్ దర్గాను దేశంలోని వారే కాకుండా విదేశాలకు చెందిన వారు కూడా పెద్దసంఖ్యలో దర్గాను సందర్శించేందుకు వస్తుంటారు. ఈ దర్గాలో ప్రతీ ఏడాది ఉరుసు ఉత్సవాలను కోలాహలంగా జరుపుకుంటారు. ఈ ఏడాది ఉత్సవాలు సోమవారం రాత్రి దర్గా ప్రాంగణంలో పతాకావిష్కరణతో ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా నాగపట్నంలోని మీరా సాహెబ్ మసీద్‌లో ఇస్లాం మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని పూలతో అలంకరించిన అద్దాల వాహనంలో ఉంచారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరిన పతాక ఊరేగింపు నాగపట్నంలోని ప్రధాన వీధుల మీదుగా సాగుతూ.. రాత్రి 7గంటలకు నాగూర్ దర్గాకు చేరుకుంటుంది. దర్గా ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన ఐదు మీనార్లపై ఒకే సమయంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన అంశంగా ఈ నెల 11వ తేదీ రాత్రి పవిత్ర గంధం పాత్ర ఊరేగింపు చేసి, 12వ తేదీ తెల్లవారు జాము నుంచి భక్తులకు గంధం ప్రసాదం పంపిణీ కార్యక్రమం జరుగుతుందని దర్గా నిర్వాహకులు తెలిపారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన అన్బుమణి



నీటమునిగిన పంట వివరాలు తెలుసుకుంటున్న అన్బుమణి

వాషర్‌మెన్ పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలో వరద బాధిత ప్రాంతాలను సోమవారం పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ పరిశీలించారు. జిల్లాలోని విల్లుపురం, దిండివనం, బ్రహ్మదేశం, వానూర్, కిలియనూర్, కోటకుప్పం, సెంజి, విక్రవాండి, తిరువెన్ననేనల్లూర్, మయిలం తదితర గ్రామాల్లో సుమారు 10వేలకు పైగా ఇళ్లలో వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో, దిండవనం ప్రాంతంలో డా.అన్బుమణి పర్యటించారు వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

'సైన్స్ ఎక్స్‌పో'లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



తమ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఐసిఎఫ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురంలో ఉన్న సన్‌షైన్ శారద సెకండరీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన 'సైన్స్ ఎక్స్‌పో'లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ది సైన్స్ ఓయేజ్' పేరిట నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు పాల్గొని పలు ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు. ఎవరి ప్రమేయం లేకుండా తమకు తామే విద్యార్థులు ఈ ప్రాజెక్టులు రూపొందించారు. విద్యార్థుల సృజనాత్మకత వెలికితీసి సరికొత్త ఆవిష్కరణలు వెలువరించేలా వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శన ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దేవతల విగ్రహాలు లభ్యం



ఐసిఎఫ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి సమీపం మూవానల్లూర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దహన వాటిక నిర్మాణాలకు ఆదివారం పనులు చేపట్టారు. గుంతలు తీస్తున్న సమయంలో మట్టిలో రెండు విగ్రహాలు లభ్యమయ్యాయి. సమాచారం అందుకున్న మన్నార్‌గుడి తహసీల్దార్ కార్తికేయన్, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని విగ్రహాలు స్వాధీనం చేసుకొని ఆర్డీఓ కార్యాలయంలో అప్పగించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ... పురావస్తు శాఖ అధికారుల పరిశీలించిన అనంతరం ఆ విగ్రహాల గురించిన సమాచారం లభిస్తుందని తెలిపారు.







పల్లకిపై జనని.. పులకించిన అవని

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు సోమవారం ఆద్యంతం వైభవంగా సాగాయి. కమ్ముకున్న కారుమబ్బులూ.. ఉండి ఉండీ కురుస్తున్న వానజల్లుల నడుమ మాడవీధులు కళాబృందాల ప్రదర్శనలతో హోరెత్తాయి. లక్ష్మీకాసుల హారం ఊరేగింపు, వసంతోత్సవం సోమవారం విశేషంగా సాగాయి.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మోహినీ రూపి

వాలుజడ వయ్యారం.. అర్ధనిమీలిత నేత్రాలు.. చిరుమందహాసం.. పున్నమి జాబిల్లిని మించి న ముఖారవిందంతో పద్మావతి అమ్మ మోహిని అవతారంలో పల్లకిలో ఊరేగారు. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల దాకా మాడవీధుల్లో కిక్కిరిసిన భక్తజనసందోహం నడుమ పల్లకిసేవ సాగింది.









అమ్మవారికి గజవాహనం రోజున వసంతోత్సవం (చందనోత్సవం) వేడుకగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం పద్మావతమ్మను ఆలయ ప్రదక్షిణగా సన్నిధి మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.

గంధము పుయ్యరుగ...

సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ కమల తిరుచ్చిపై అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ.. చిరుజల్లుల నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు.

నేడు గరుడవాహనం

- ఉదయం 8 గంటలకు : సర్వభూపాల వాహనం
- సాయంత్రం 4.20 : స్వర్ణరథోత్సవం
- రాత్రి 7 : గరుడవాహనం

దేవేరికి శ్రీవారి లక్ష్మీకాసుల హారం

గజవాహనమెక్కి ఊరేగే దేవేరి కోసం సోమవారం తిరుమల శ్రీనివాసుడు తన సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని పంపారు. పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే ఈ హారాన్ని గజవాహన సేవలో అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. ఉదయం తిరుమల ఆలయంలో లక్ష్మీకాసుల హారాన్ని శ్రీవారిపాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల మాడవీధుల్లో ఊరేగించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుచానూరుకు తీసుకువచ్చారు. తిరుచానూరు పసుపు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర మాడవీధుల నుంచి అమ్మవారి ఆలయం వరకు వేడుకగా సాగింది. హారాన్ని అమ్మవారి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజవాహనసేవలో అమ్మవారికి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు పాల్గొన్నారు.

ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఆర్డీవో ఈ.కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రజలు తిరుపతి జిల్లా కేంద్రానికి రావడానికి దాదాపు 3 గంటలకు పైగా సమయం పడుతుందన్నారు. పేదలు అంతదూరం రాలేరని, జిల్లా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపామన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్ నిర్వహించి అర్జీలు స్వీకరించామన్నారు. ఇకపై ప్రతి రెండు వారాలకోసారి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని ఎంచుకొని పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 164 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ డ్రైనేజీ, తాగునీరు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎంపీడీవో ప్రమీలా రాణి, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, పీఆర్ డీఈ రమణయ్య ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థానికుల్లో ఆనందం

- నేటి శ్రీవారి దర్శనానికి టోకెన్ల జారీ

తిరుపతి/తిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్లను సోమవారం జారీ చేయడంతో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. స్థానికులకు తొలిసారిగా 2013లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా మొదటి మంగళవారం 5వేల టోకెన్లు చొప్పున ఇస్తూ వచ్చారు. 2019లో జగన్ సీఎం కాగానే స్థానికుల దర్శనానికి మంగళం పాడారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయినా స్థానికుల దర్శనం పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో కూటమితరఫున పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల హామీగా స్థానికులకు శ్రీవారి దర్శనం అంశాన్ని తీసుకొచ్చారు. ఈక్రమంలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక.. తొలి సమావేశంలోనే స్థానికుల దర్శనాన్ని పునరుద్ధరించింది. గతంలో తిరుమల, తిరుపతి వారికే ఉండగా.. ఇప్పుడు చంద్రగిరి, రేణిగుంట మండలాలనూ కలిపారు. మంగళవారం నాటి దర్శనానికి సోమవారం ఉదయం తిరుపతిలోని మహతిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి కలిసి కొంతమంది స్థానికులకు స్వయంగా టోకెన్లు జారీ చేశారు. వేకువజాము 4నుంచి ఉదయం 11.30 గంటలకే 2500 టోకెన్లు పూర్తయ్యాయి. తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 7.30 గంటలకు టోకెన్ల జారీని ప్రారంభించారు. ఈ టోకెన్లు పొందిన వారికి.. తిరిగి మూడు నెలల తర్వాతే అవకాశం ఉంటుంది. దీంతో వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్లు రావనే భయంతో కొందరు వెనకడుగు వేశారు. దీంతో తిరుమలలో 500 టోకెన్లు స్థానికుల కోసం కేటాయించినా.. 403 మాత్రమే తీసుకోగా 97 మిగిలిపోయాయి. ఈ టోకెన్లు తీసుకున్న వారు మంగళవారం ఉదయం ఒరిజినల్ ఆధార్ కార్డులతో.. ఆయా టైం స్లాట్ల ప్రకారం దివ్యదర్శనం క్యూలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.



తిరుమలలో టోకెన్లు పొందిన స్థానికులు



తిరుపతిలో టోకెన్ల కోసం క్యూలో వెళుతున్న స్థానికులు

ఇదో గొప్ప అవకాశం

తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు ఇదో గొప్ప అవకాశమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తొలిబోర్డులోనే తీసుకున్న నిర్ణయాన్ని ఎంతో కష్టపడి ఇంత త్వరగా అమలు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనానికి ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికుల దర్శనానికి ప్రణాళికలు రూపొందించుకున్నామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లకు, స్థానికుల దర్శన టోకెన్లకు సంబంధించి త్వరలోనే స్పష్టత ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానికుల కోటాలో తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సాధారణ దర్శనాలే కాకుండా ఆర్జిత సేవల్లోనూ ప్రత్యేక కోటా ఇవ్వాలని కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. గతంలో ఉన్న 5వేల టోకెన్లు మూడు వేలకు కుదించడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తిరుమల శ్రీవారికి, స్థానికులకు ఉన్న అనుబంధాన్ని విడగొట్టిన వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, వరప్రసాద్, రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, కూరపాటి సురేష్, మునస్వామి, యాదవకృష్ణ పాల్గొన్నారు.





ప్రొఫెసర్ చెంగయ్య కారుపై దాడి చేసిన దృశ్యం - ఉద్యోగులు, విద్యార్థుల వాట్సప్ గ్రూపులో అన్యమత ప్రచారం

ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో 'అన్యమత' కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం అన్యమత ప్రచారంపై కలకలం రేగింది. ఈఈఈ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య మత ప్రచారం చేస్తున్నారంటూ భజరంగ్‌దళ్, ఏబీవీపీ ఆరోపించాయి. యూనివర్సిటీ, కాలేజీ జారీ చేసే సర్క్యులర్‌పైన 'ప్రైజ్ ద లార్డ్' అని రాయడాన్ని వారు తప్పుపట్టారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భజరంగ్‌దళ్ నాయకులు విష్ణు ప్రతీక్ రెడ్డి, కిరీటి, ఏబీవీపీ నాయకులు పూజారి రాఘవేంద్ర, సురేంద్ర తదితరులు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రొఫెసర్ చెంగయ్య చాంబరులోకి వెళ్లి వర్సిటీలో మత ప్రచారం ఎలా చేస్తారంటూ నిలదీశారు. ఆయన్ను చొక్కా పట్టుకొని బయటకు తీసుకొచ్చిన వారు.. ఇటుకలతో కారుపై దాడి చేశారు. అనంతరం వారు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, హెడ్ రూములో కుర్చీ వెనుక గల వేంకటేశ్వర స్వామి పటాన్ని తొలగించారని, స్టూడెంట్స్, ఎంప్లాయీస్ ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో ఏసు స్తోత్రాలు, వీడియోలు పంపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై ఫిర్యాదులు వచ్చాయి.

మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుతో కమిటీ

కాగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మత వివక్ష చూపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై మహిళా ప్రొఫెసర్ ఉషారెడ్డి వీసీ, రిజిస్ట్రార్‌కు మౌఖిక ఫిర్యాదు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా ఫిర్యాదు వస్తేనే తాము పరిశీలిస్తామని వారు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు ఆమె ఫిర్యాదు చేశారు. వృత్తిపరమైన వేధింపులకు గురి చేస్తున్నారనీ, రాత్రి దాకా తమను విభాగంలోనే ఉండేలా చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు నేతృత్వంలో ఐదుగురు మహిళా ప్రొఫెసర్లతో ఆయన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. లేడీ ఫ్యాకల్టీతో పాటు ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులందరిని ఈ కమిటీ విచారిస్తుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కాలేజీ కౌన్సిల్‌లోనూ దీనిపై చర్చించామని, విచారణలో భాగంగా ప్రొఫెసర్ చెంగయ్యను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

14 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్ట్

రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్ల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం/ఏర్పేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం ఆదివారం రాత్రి కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్‌లో ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. చింతపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలెరో గూడ్స్ వాహనాల్లో కొంతమంది అనుమానాస్పదంగా దిగుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టుముట్టి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా పిడిలేని ఇనుప బరిసెలు, గొడ్డళ్లు, రంపపు చుట్ట వంట సామగ్రి దొరికాయి. పట్టుబడ్డ వారిలో 13 మంది తమిళనాడుకు చెందిన వారు కాగా ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుపడ్డ స్మగ్లర్లను, వాహనాలను, గొడ్డళ్లు, రంపాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేఖకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెవిరెడ్డి చేసింది తప్పుకాదా?

దీనిపై ప్రతిఒక్కరూ ఆలోచించండి ● బాలిక తండ్రి గొంతు నొక్కేసినా సాక్ష్యాలు ఉన్నాయన్న ఎమ్మెల్యే నాని

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నమ్మి వైసీపీ నేతలు పదేపదే మోసపోతుంటారు. ఎర్రావారిపాలేనికి చెందిన బాలిక తండ్రిని నేనెప్పుడూ విమర్శించను. గతంలో ఆయన ఏమి మాట్లాడారో, ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నాడో ప్రజలందరికీ తెలుసు. చెవిరెడ్డి చేసింది తప్పు కాదా? అని మాత్రమే ఆలోచించండి. మనకి కూడా ఆడబిడ్డలు ఉన్నారు. మీవిజ్ఞతకే వదిలేస్తున్నా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద ఘటనపై బాలిక తండ్రితో కలిసి వైసీపీ నేతలు భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడిన వ్యవహారంపై సోమవారం నాని స్పందించారు. యల్లమంద ఘటన సమయంలో రమణతో కలసి ఆయన కోడలు మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. ఫిర్యాదుదారుల గొంతు నొక్కేస్తే సుమోటాగా కూడా తీసుకునే అవకాశం పోక్సో కేసులకు ఉందన్న విషయం వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా చెవిరెడ్డిపై పోరాటం చేస్తున్నానని, భూమనకు శిష్యుడునని చెప్పుకునే చెవిరెడ్డి ఆయన పట్ల ఎలా నడుచుకుంటున్నారో కూడా అందరికీ తెలుసన్నారు. పోలీసులు కక్షసాధింపుగా కేసులు పెడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనవసరంగా 37 మంది టీడీపీ నాయకులపై చెవిరెడ్డి కేసులు పెట్టించారని గుర్తుచేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందా? లేదా? అని మాత్రమే ఆలోచించాలన్నారు. సాక్ష్యాలు అనేవి ఖచ్చితంగా ఉంటాయని, న్యాయవ్యవస్థ ఎవరికి అన్యాయం జరిగిందో వారిని కాపాడితీరుతుందన్నారు. గత ఐదేళ్లలో తిరుపతి రూరల్లో అభివృద్ధి ఆగిపోయిందని, ఇప్పుడు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు గుండెలపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారన్నారు.

నాణ్యమైన మద్యం కాదు.. విద్యనందించాలి

- సీపీఎం జిల్లా సభల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

సత్యవేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కావాల్సింది నాణ్యమైన మద్యం కాదని.. నాణ్యమైన విద్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ జిల్లా సభల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని స్మార్ట్‌సిటీగా చేస్తామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రారంభమైన సోమశిల- స్వర్ణముఖి లింకు కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. అదానీ సోలార్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధికి 28 అంశాలతో కూడిన తీర్మానాలను సభలో ఆమోదించారు. నాయకులు రమేష్, గంధం మణి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నాగరాజు



జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, సభ్యులుగా భగత్, సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య వ్యవహరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. రూ.3.33 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది.